క్లుప్తంగా

అగ్నిప్రమాద బాధితులకు డిప్యూటీ సీఎం సాయం



బాధితులకు సాయం అందిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

మాడుగుల: మండలంలో కింతలి వల్లాపురం పంచాయతీ శివారు గ్రామం వెలంపాడులో ఈ నెల 2న రెండు పూరిళ్లు అగ్ని ప్రమాదంలో దగ్ధమైన విషయం తెలిసిందే. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు గురువారం బాధితులు ఉద్దండపు లక్ష్మి, మాడిచి చినమ్మలును పరామర్శించి, రూ.3 వేలు చొప్పున నగదు, 25 కిలోల చొప్పున బియ్యం, నిత్యావసర సరకులు అందించారు. ప్రభుత్వం ద్వారా రూ.15 వేలు చొప్పున సాయం అందిస్తామని భరోసానిచ్చారు. ఆయన వెంట జెడ్పీ సీఈవో ఎం.పోలినాయుడు, వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, సర్పంచ్ తాళ్లపురెడ్డి రాంబాయి, ఎంపీటీసీ బగుడు వరహాలమ్మ, ఉప సర్పంచ్ మట్టా గోవింద్, పీఏసీఎస్ అధ్యక్షుడు తాళ్లపురెడ్డి సోమన్నదొర, వైఎస్సార్‌సీపీ నాయకులు రాంబాబు, సీతారామయ్య తదితరులున్నారు.

రైతాంగాన్ని ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుంది



సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ, ఇతర నేతలు

మాకవరపాలెం: తుపానుకు నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తుపాను నష్టంపై గత మూడురోజులుగా వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు సీఎం జగన్ ఆదేశాలతో విచారణ చేస్తున్నట్లు తెలిపారు. రంగుమారిన, తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. వర్షానికి దెబ్బతిన్న ఇళ్లకు నష్టపరిహారం అందేలా అధికారులు చర్యలు చేపట్టారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాజారావు, పార్టీ జిల్లా కార్యదర్శి బొడ్డు గోవిందరావు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ పెట్ల భద్రాచలం, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ నాగేశ్వరరావు, యూత్ అధ్యక్షుడు పిల్లా శ్రీను పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి శిక్షణ

నర్సీపట్నం: ప్రభుత్వ ఐటీఐలో నిరుద్యోగ యువతీ, యువకులకు స్వయం ఉపాధి, ఉద్యోగ శిక్షణ ఇస్తున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసాచారి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్ అర్హత కలిగిన వారు సర్టిఫికెట్లు, రెండు ఫొటోలు, జెరాక్స్‌లతో ఈ నెల 12న కళాశాలలో సంప్రదించాలన్నారు. ఎలక్ట్రిషియన్ డొమెస్టిక్ సొల్యూషన్స్, స్ట్రీట్ లైట్స్ ఇన్‌స్టలేషన్ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నట్లు వెల్లడించారు. ఈ నెల 13 నుంచి శిక్షణ ప్రారంభమవుతుందన్నారు. వివరాలకు 94918 13637 నంబరును సంప్రదించాల్సిందిగా సూచించారు.

కాలి నడకన వెళ్లి అయ్యప్పను దర్శించి



శబరిమలై ఆలయంలో ఇరుముడితో గొల్లవిల్లి శ్రీను స్వామి

మాడుగుల రూరల్: హరిహర సుతుడు అయ్యప్పస్వామి దర్శనానికి మాలధారణ చేసిన ఎం.కోడూరు గ్రామానికి చెందిన గొల్లవిల్లి శ్రీను కాలి నడకన వెళ్లి స్వామిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఏడాది అక్టోబరు 24న తొలిసారిగా మాలధారణ చేసిన శ్రీను, 26న గ్రామం నుంచి కాలినడనకన శబరిమలకు బయలుదేరారు. బుధవారం ఆయన స్వామి సన్నిధానానికి చేరుకున్నారు. దీంతో తన 42 రోజుల దీక్ష కూడా ముగిసిందన్నారు. స్వామి దర్శనం అనంతరం శబరిమల నుంచి నుంచి ఫోన్‌లో సాక్షితో మాట్లాడారు. స్వగ్రామం నుంచి 1426 కి.మీ. నడిచి, స్వామిని దర్శించుకోవడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు.

అతుకుల బతుకులకు జగనన్న చేదోడు



నా పేరు యర్రంశెట్టి వెంకటసత్యనారాయణ. మాది కొవ్వూరు గ్రామం. దాదాపు ముప్పయ్యేళ్లుగా దర్జీ పనే జీవనాధారంగా చేసుకున్నా. సంక్రాంతి వస్తోందంటే నెల, రెండు నెలల ముందు నుంచీ కుటుంబమంతా ఇదే పనిలో బిజీ. భార్యా పిల్లల సాయంతో రాత్రీపగలూ తేడా లేకుండా బట్టలు కుట్టేవాళ్లం. చాలా మంది మా బట్టలు కుట్టాలంటే.. మావి కుట్టాలంటూ ఒత్తిడి చేసేవారు. ఈ 30 ఏళ్లలో తొలి పదేళ్లు సంక్రాంతి పండగను అదే రోజు చేసుకున్న విషయం గుర్తేలేదు. ఎందుకంటే చివరి నిమిషం వరకూ కొత్త బట్టలు కుడుతూనే టైం గడిచిపోయేది. గత కొన్నేళ్లుగా పరిస్థితి చాలా మారిపోయింది. రేడీమేడ్ దుస్తులు వచ్చాక మా బతుకుల్లో కూడా మార్పులొచ్చేశాయి. చేద్దామంటే చేతి నిండా పని దొరికే పరిస్థితి లేదాయే..! ఈ పని తప్ప వేరే పని చేతకాదు. జగనన్న ప్రభుత్వంలో మా బతుకులకు కాస్త భరోసా దక్కింది. టైలరింగ్ సామగ్రి, కొత్త మిషన్ కొనుగోలుకు జగనన్న చేదోడు పథకంలో ఇస్తున్న డబ్బులు చాలా ఉపయోగపడుతున్నాయి. సీఎం జగన్ మా బతుకులను ఆదుకున్న ఆపద్బాంధవుడు.



- దర్జీల బతుకుల్లో వెలుగులు
- ఏటా రూ.10 వేలు చొప్పున జమ

అతుకుల బతుకులు వారివి. కత్తిరించిన దుస్తుల్ని బాహ్య సౌందర్యం ఇనుమడించేలా కుట్టే దర్జీలు వారు. పండగలు, పెళ్లిళ్ల సీజన్ వచ్చిందంటే రాత్రీపగలూ నిద్రలేనంతగా చేతినిండా పని. రెండు దశాబ్దాలుగా వారి బతుకుల్లో చాలా మార్పులొచ్చాయి. రెడీమేడ్ దుస్తుల రాకతో వారి బతుకులు కూడా ఏ రోజు కారోజు అన్నట్టుగా మారాయి. అలాంటి దర్జీల బతుకుల్లో వెలుగులు నింపే పథకమే జగనన్న చేదోడు.

రోలుగుంట: గ్రామీణ ప్రాంతాల్లో దర్జీల పరిస్థితి దయనీయంగా మారింది. రెడీమేడ్ దుస్తుల జోరులో వస్త్రం(క్లాత్) తీసుకుని, దర్జీల ద్వారా కుట్టించుకునే పరిస్థితులు చాలా వరకు తగ్గిపోయాయి. ఇలాంటి చేతి వృత్తులపై ఆధారపడి జీవించే(దర్జీలు, రజకులు, నాయీబ్రాహ్మణుల) బతుకులు ఆర్థికంగా చాలా వరకు చితికిపోయాయి. గత ప్రభుత్వం వీరిని పట్టించుకున్న పాపాన పోలేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వీరి బతుకుల్లో భరోసా నింపేందుకు చర్యలు తీసుకున్నారు. అందులో భాగంగానే జగనన్న చేదోడు పథకానికి శ్రీకారం చుట్టారు. ఈ పథకంలో భాగంగా వీరికి ఆర్థిక భరోసానిచ్చేందుకు ఏడాదికి రూ.10 వేలు చొప్పున వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తున్నారు. ఇప్పటి వరకు నాలుగు విడతలుగా ఒక్కో లబ్ధిదారుకి రూ.40 వేలు చొప్పున, మండల పరిధిలోని 463 మంది దర్జీలకు రూ.1.85 కోట్ల మేర లబ్ధి చేకూరింది.

మండలంలో దర్జీలకు లబ్ధి

పంచాయతీలు	24
సచివాలయాలు	16
లబ్ధిదారులు	463 మంది
నాలుగేళ్లలో లబ్ధి	రూ.1.85 కోట్లు



బుచ్చింపేటలో దుస్తులు కుడుతున్న శివ

చేతి వృత్తులకు ఆసరా



వృత్తిదారుల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన చేదోడు పథకం వారికి ఎంతగానో లబ్ధి చేకూర్చుతోంది. ఏటా నిధులు వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేయడంతో పాటు, వారి జీవన విధానాన్ని పర్యవేక్షిస్తున్నాం. ఈ నిధులు ఎంత మేరకు వారి వృత్తికి ఉపయోగపడుతున్నాయో ఆరా తీస్తున్నాం. ప్రభుత్వం పేర్కొన్న అర్హతల మేరకు లబ్ధిదారులను ఎంపిక చేశాం. దర్జీలకు చాలా వరకు ఈ పథకం ఉపయోగపడింది. కొత్త కుట్టుమిషన్లు, టైలరింగ్ సామగ్రి కొనుగోలు చేసుకుని, పథకం అమలుపై ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

– కె.ప్రభాకరరావు, ఎంపీడీవో, రోలుగుంట

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

నర్సీపట్నం: వివిధ అనారోగ్యాలతో బాధపడుతున్న ఏడుగురికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ గురువారం బాధిత కుటుంబాలకు అందించారు. మండలంలోని ధర్మసాగరానికి చెందిన తోటకూర సీతారాం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. సీతారాం కుటుంబానికి రూ.2 లక్షలు, వివిధ రకాల వ్యాధులకు వైద్య ఖర్చుల నిమిత్తం అమలాపురానికి చెందిన బంగారు లోవతల్లి రూ.52 వేలు, వేములపూడిలో కానేటి ఆనంద్‌కు రూ.70 వేలు, నారికల్ల సంధ్యకు రూ.18 వేలు, యరకన్నపాలెంలో బీమిరెడ్డి స్వామినాయుడుకు రూ.56 వేలు, చెట్టుపల్లిలో జాలారి గంగతల్లికు రూ. 60 వేలు, ఓఎల్ పురం పెదపూడి దివ్యవాణి, నీలంపేటలో యామగిరి నూకరాజుకు రూ.లక్షా 20 వేలు చొప్పున మొత్తం రూ.5.76 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సుర్ల రాజేశ్వరి, పార్టీ మండల అధ్యక్షుడు సుర్ల సత్యనారాయణ, వైస్ ఎంపీపీ తాతబాబు, ఎంపీటీసీ బోళెం వెంకటేష్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు గొంప కన్నయ్యనాయుడు, మండల సచివాలయాల కన్వీనర్ శానాపతి వెంకటరత్నం, ఎంఎల్‌వో సుర్ల చంద్రశేఖర్, పీఏసీఎస్ మురళి, పార్టీ నాయకులు ఇన్నం రమణ, మాకిరెడ్డి సత్తిబాబు, పెట్ల చినఅప్పలనాయుడు, గుడివాడ లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షలు నెరవేరేలా జగన్ పాలన



మామిడిపల్లిలో సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ కర్రి సత్యం, భాస్కరరావు, బాబూరావు

- జగన్ పాలనలో ఇంటి వద్దకే సంక్షేమం
- 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో నేతలు




సంక్షేమ, అభివృద్ధి బోర్డును ఆవిష్కరిస్తున్న అనురాధ, జగన్‌మోహన్

కె.కోటపాడు: ప్రజల ఆకాంక్షలకు తగ్గట్టు సీఎం జగన్ పాలన అందిస్తూ, అందరి మన్ననలను పొందుతున్నారని అనకాపల్లి జిల్లా వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు ఈర్లె అనురాధ అన్నారు. రొంగలినాయుడుపాలెంలో గురువారం ఏపీకి జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. గ్రామంలో ప్రజలకు అందించిన సంక్షేమం, జరిగిన అభివృద్ధి పనుల వివరాలను తెలియజేస్తూ ఏర్పాటు చేసిన బోర్డును ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్‌తో కలిసి ఆమె ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పైల పైడితల్లమ్మ, కోటేశ్వరరావు, ఎంపీటీసీ గొర్రుపోటు రామలక్ష్మి, ఎంపీడీవో ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి కె.భీమరాజు, జేసీఎస్ మండల కన్వీనర్ ఏటుకూరి రాజేష్ పాల్గొన్నారు.

దేవరాపల్లి: రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా ప్రతీ ఇంటి తలుపు తట్టి మరీ సంక్షేమ పథకాలు అందిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించాలని జెడ్పీటీసీ కర్రి సత్యం కోరారు. మామిడిపల్లిలో స్థానిక సర్పంచ్ కర్రి సూరినాయుడు ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ముందుగా దివంగత నేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక సచివాలయం పరిధిలోని మామిడిపల్లి, తిమిరాం గ్రామాలలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల బోర్డును, వైఎస్సార్‌సీపీ జెండాను పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు, మండల అధ్యక్షుడు బూరె బాబూరావు, సర్పంచ్ కర్రి సూరినాయుడుతో కలిసి ఆవిష్కరించారు. ఇంటింటికి వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన మేలును వివరించి, బ్రోచర్లను పంపిణీ చేశారు. రాత్రికి అక్కడే భోజనం అనంతరం పల్లె నిద్ర చేశారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ పంచాడ సింహాచలంనాయుడు, తిమిరాం సర్పంచ్ రెడ్డి సూర్యనారాయణ, జేసీఎస్ మండల కన్వీనర్ కె.వి.రమణ, పార్టీ మండల నాయకులు ఉగ్రాకుల అప్పారావు, ఉప సర్పంచ్ చల్లా సుధాకర్, నాగిరెడ్డి చిట్టినాయుడు, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ జి.సంతోషి నళిని, ఎంఎల్‌వో అన్నం పవన్‌కుమార్, పంచాయతీ సెక్రటరీ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

'ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేయాలి'



న్యాయస్థానం వద్ద ధర్నా చేస్తున్న న్యాయవాదులు

అనకాపల్లిటౌన్: ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ స్థానిక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు గురువారం న్యాయస్థానం వద్ద ధర్నా, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు సాయిలక్ష్మణ్ మాట్లాడుతూ ల్యాండ్ టైటిలింగ్ చట్టం అమలు జరిగితే సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే సమస్య ఉంటుందన్నారు. సివిల్ కోర్టు పరిధి నుంచి రెవెన్యూ పరిధిలోకి భూ వివాదాలకు సంబంధించి చట్టాన్ని తేవడంతో ప్రజలు మధ్య వివాదాలు పెరిగిపోతాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాధులు పిళ్లా హరశ్రీనివాస్, కుమార్, కనిశెట్టి సురేష్‌బాబు, బాలగంగాధర్ తిలక్, పీఎస్.పట్నాయక్, సుధాకర్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

రైతాంగానికి అండగా ప్రభుత్వం



పైడంపేటలో వరిపంటను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ అనురాధ, ఎంపీపీ జగన్‌మోహన్



కాశీపురంలో నీట మునిగిన పంటను పరిశీలిస్తున్న కిలపర్తి భాస్కరరావు, బూరె బాబూరావు



డి.సురవరంలో నేలకూలిన వరి పైరును పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

కె.కోటపాడు: మిచాంగ్ తుపాను ప్రభావంతో పంటలకు జరిగిన నష్టాన్ని త్వరితగతిన అధికారులు లెక్కించే కార్యక్రమాన్ని పూర్తి చేయనున్నట్లు అనకాపల్లి జిల్లా వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు, జెడ్పీటీసీ ఈర్లె అనురాధ, ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో గురువారం పర్యటించి, పంట నష్టాన్ని పరిశీలించారు. రైతులకు ధైర్యం చెప్పారు. పైడంపేట, గొండుపాలెం, రొంగలినాయుడుపాలెం, ఆర్‌వై అగ్రహారం, వారాడ, కొరువాడ గ్రామాల్లో ముంపు నీటిలో ఉన్న వరి పంటను క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ మండలంలో వరకూ తుపాను ప్రభావం 16 గ్రామాల్లో ఉన్నట్లు అధికారులు గుర్తించారన్నారు. ఆయా గ్రామాల్లో 909 మంది రైతులకు చెందిన 668 ఎకరాల్లో పంటకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనాగా పేర్కొన్నారు. పంట నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీరాజు, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, మండల వ్యవసాయాధికారి సోమశేఖర్, సర్పంచ్‌లు వంటాకు కనక మల్లీశ్వరి, వేచలపు దొరబాబు, గొర్రుపోటు వెంకటరావు, చీపురపల్లి అచ్చిబాబు, ఏటుకూరి రాజేష్, బొడ్డు తాతయ్యబాబు, పైల అమ్మాజీ, నారాయణమ్మ, రొంగలి రమేష్ పాల్గొన్నారు.

చీడికాడ: తుపాను ప్రభావంతో పంట నష్టానికి గురైన ప్రతి రైతుకు న్యాయం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, ఎంపీపీ కురచా జయమ్మ నారాయణమూర్తి భరోసానిచ్చారు. డిప్యూటి సీఎం బూడి ముత్యాలనాయుడు ఆదేశాల మేరకు పార్టీ మండల నేతలు గురువారం ఉదయం పలు గ్రామాల్లో పర్యటించారు. డి.సురవరంలో బాధిత రైతులను డిప్యూటీ సీఎం బూడి ఫోన్‌లో పరామర్శించారు. ఈ సందర్భంగా వారు రైతులతో మాట్లాడుతూ దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రతి గింజను ప్రభుత్వమేనేరుగా కొనుగోలుచేస్తుందన్నారు. కార్యక్రమంలో డి.సురవరం పీఏసీఎస్ అధ్యక్షుడు నందారపు రమణబాబు, వైస్ ఎంపీపీ ధర్మిశెట్టి స్వాతికొండబాబు, సర్పంచ్ కోన అర్జున, మండల సచివాలయాల కన్వీనర్ ఈర్లె చైతన్య, యువజన విభాగం అధ్యక్షుడు గొల్లవిల్లి స్వామినాయుడు పాల్గొన్నారు.

దేవరాపల్లి: తుపాను ప్రభావంతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు, మండల అధ్యక్షుడు బూరె బాబూరావు భరోసా ఇచ్చారు. మండలంలోని కాశీపురం, చిననందిపల్లి గ్రామాల్లో వ్యవసాయ సిబ్బందితో కలిసి పర్యటించి, నీట మునిగిన వరి పంటను పరిశీలించారు. పంట నష్టాన్ని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుకు నివేదిస్తామన్నారు. వీరి వెంట పార్టీ మండల యువజన అధ్యక్షుడు కర్రి సూరినాయుడు, మహిళా అధ్యక్షురాలు రొంగలి నారాయణమ్మ, బండారు దేముడునాయుడు, దాసరి మంగునాయుడు, చలుమూరి చంద్రమోహన్, పోతల రఘు, పాటూరు నాయుడు, రావాడ శ్రీను తదితలు ఉన్నారు.

నష్టాన్ని మిగిల్చిన మిచాంగ్

- నీటి ముంపులో వరి చేలు
- రోడ్లపై ప్రవహిస్తున్న వరద నీరు
- నేలవాలిన పైరు నిలబెట్టడంలో రైతులు బిజీ



దబ్బకుంటు రోడ్డు రాచెరువులో నేలవాలిన వరిచేనును నిలబెడుతున్న రైతు జగన్నాథరావు



వర్షాలకు దబ్బకుంటు-మాడుగుల రహదారి మీద పొంగి ప్రవహిస్తున్న వాన నీరు



రైతుల సమక్షంలో దెబ్బతిన్న పంట వివరాలను నమోదు చేస్తున్న వ్యవసాయ అధికారులు

మాడుగుల రూరల్: మిచాంగ్ తుపాను తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. ఆరుగాలం శ్రమించి పండించిన వరి పంట తాజా వర్షాలకు పూర్తిగా ముంపునకు గురయింది. పంట పొలాల మీదుగా నీరు ప్రవహిస్తోంది. మండలంలో వంటర్లపాలెం నుంచి ముకుందపురం రహదారి మీదుగా నీటి ప్రవహం ఇంకా తగ్గలేదు. ఈ రహదారి కోతకు గురైనట్లు ముకుందపురం సర్పంచ్ కర్రి గణేష్ తెలిపారు. కె.జె.పురం జంక్షన్ నుంచి గ్రామంలోకి పోయే రహదారి మీద నీరు పొంగి ప్రవహిస్తోంది. దబ్బకుంటు– మాడుగుల రహదారిలో నీటి ప్రవాహానికి గడ్డివాములు కొట్టుకుపోయాయి. కె.జె.పురం, పప్పుసెట్టి చేరీ, మాడుగుల, రాచెరువు, మేకల చెరువు, ఎర్రన్న చెరువు, గుండా పొలంలలో వరి పంట నీట మునిగింది. ముకుందపురం, వంటర్లపాలెం, వీరవల్లి, పోతనపూడి, జి.అగ్రహారం, చింతలూరు, వీరనారాయణం, గదబూరు, ఎం.కోటపాడు, వల్లాపురం, సాగరం, సురవరం, ఎం.కోడూరు, తాటిపర్తి, శంకరం తదితర గ్రామాల్లో ముంపునకు గురైన ప్రాంతాలను వీఆర్వోలు, ఉద్యానవన, వ్యవసాయ అధికారులు గురువారం పరిశీలించారు.

పంట నష్టం అంచనాలో అధికారులు

నాతవరం: మండల వ్యాప్తంగా వ్యవసాయ అధికారులు, సచివాలయ సిబ్బంది క్షేత్రస్థాయిలో పంట నష్టాలను అంచనావేసే పనిలో ఉన్నారు. బుధవారం ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ తుపానుకు దెబ్బతిన్న పంట పొలాలను స్వయంగా పరిశీలించారు. రైతుల పంట నష్టాన్ని లెక్కించే విషయంలో వివక్షకు తావులేకుండా పని చేయాలని అధికారులను ఆదేశించారు. మండలంలో జరిగిన పంట నష్టాన్ని ఉన్నతాధికారుల దృష్టికి ఎమ్మెల్యే తీసుకెళ్లడంతో సంబంధిత శాఖల అధికారులు మండల వ్యాప్తంగా పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తున్నారు. ఈ విషయమై తహసీల్దార్ ఎస్ఎస్‌వీ శ్రీనివాస్‌నాయుడు మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు రైతుల సమక్షంలో పంటలను పరిశీలించి, నష్ట వివరాలను నమోదు చేస్తున్నట్లు వెల్లడించారు.

మాకవరపాలెం: తుపాను కారణంగా కురిసిన వర్షానికి మండలంలోని లచ్చన్నపాలెం నుంచి రోలుగుంట మండలం కుసర్లపూడి వెళ్లే రోడ్డు కోతకు గురైంది. రోడ్డు పక్కనే ఉన్న కొండగెడ్డ ఉధృతికి ఈ రోడ్డు బాగా దెబ్బతింది. దీంతో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న ఆర్అండ్‌బీ డీఈ నాగమోహన్, జేఈ ప్రసాద్ ఈ రోడ్డును గురువారం పరిశీలించారు. మరమ్మతులకు అవసరమైన నిధుల కోసం ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.

చీడికాడ: తుపాను ధాటికి మండలంలోని ఖండివరం నుంచి మాడుగుల వెళ్లే రోడ్డులో ఖండివరం మోసూరి వారి కల్లాల వద్ద కల్వర్టు ధ్వంసమైంది. దీంతో ఆ మార్గంలో వెళ్లే వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ కల్వర్టును వెంటనే పునర్నించేలా చూడాలని రెండు మండలాల ప్రజలు కోరుతున్నారు.



కోతకు గురైన కుసర్లపూడి రోడ్డు



సాగరంలో నేలకొరిగిన వరి పంట



మోసూరు కల్లాల వద్ద దెబ్బతిన్న కల్వర్టు

11న మృత్యుంజయ హోమం

అనకాపల్లిటౌన్: బట్లపూడి పంచాయతీ రాయుడుపేట సోహం ఆశ్రమంలో ఈనెల 11వ తేదీన ఉదయం 6 నుంచి సాయంత్రం 6 వరకూ మహా మృత్యుంజయ హోమం నిర్వహిస్తున్నట్లు ఆశ్రమం నిర్వాహకులు కాండ్రేగుల రవి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్తీకమాసం నాలుగో సోమవారం పురస్కరించుకుని శివలింగానికి ప్రత్యేక పూజలు, హోమాలు, మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించనున్నట్లు తెలిపారు. హోమంలో పాల్గొనే భక్తులు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

పంట సంరక్షణపై రైతులకు సూచనలు

రోలుగుంట: మిచాంగ్ తుపాను ప్రభావంతో మండలంలో కురిసిన భారీ వర్షాలకు పలు గ్రామాల్లో పొలాలు దెబ్బతిన్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు కేవీకే కొండెంపూడి శాస్త్రవేత్తలు ఎస్.రాజ్‌కుమార్, ఎస్.సత్తిబాబు గురువారం మండల వ్యవసాయ కార్యాలయానికి వచ్చి వ్యవసాయాధికారి ఎస్.విజయలక్ష్మిని కలిసి దెబ్బ తిన్న పంట వివరాలపై చర్చించారు. దీనిలో భాగంగా వ్యవసాయాధికారి, ఆర్బీకే ఇన్‌చార్జి నాయుడుతో కలిసి కొవ్వూరు, రోలుగుంట తదితర గ్రామాలను సందర్శించారు. నేలకొరిగిన, దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. పొలంలో ఉన్న నీటిని పంట భూమిలో కాలువలు చేసి బయటికి పోయే మార్గం చేసుకోవాలన్నారు. నేలకొరిగిన పంటను వెంటనే లేవనెత్తి, కట్టలు కట్టి సంరక్షించుకోవాలని సూచించారు. తడిసిన పంటను కుప్పపెట్టినట్లయితే ఊక, ఉప్పు కలిపి పనల మధ్య పొరలుగా చల్లుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

వేంకటేశునికి ముఖమల్ క్లాత్ అందజేత



ఆలయ చైర్మన్ సకల రాజ్యలక్ష్మికి ముఖమల్ క్లాత్‌ను అందిస్తున్న నాగార్జున, లావణ్య దంపతులు

అనకాపల్లిటౌన్: స్థానిక దేమునిగుమ్మం వేంకటేశ్వరస్వామి దేవాలయం గర్భగుడిలో వేంకటేశ్వర స్వామికి వ్యాపారవేత్త గ్రంధి నాగార్జున, లావణ్య దంపతులు రూ.20వేలు విలువచేసే ముఖమల్ క్లాత్‌ను ఆలయ చైర్మన్ సకల రాజ్యలక్ష్మి, గోవింద దంపతులకు గురువారం అందించారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ స్వామివారి గర్భాలయంలో విగ్రహం వెనుక భాగాన నిత్యం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో టి.రాజసులోచన, కమిటీ సభ్యురాలు శ్రీధరాల కోమలి, అలయ అర్చకులు పులఖండం గిరిబాబు, విజయ్‌బాబు, ప్రసాద్, రాజేష్, భక్తులు పాల్గొన్నారు.